

# సంయమనం

"నాన్సెన్స్ ! నే న్నమ్మను" అన్నాడు చేతిలో కార్డు పడేస్తూ.

"అదో సైకాలజీ...అంతే" అన్నాడు డాక్టరు.

రాత్రి తొమ్మిదయింది. బయట సన్నగా వర్షం పడుతూంది. ఆట మందకొండిగా సాగుతూంది.

"ఏమిటి విషయం ?" అప్పుడే వచ్చి ఆటలో కూర్చున్న మూర్తి అడిగాడు. డాక్టరు చెప్పటం మొదలు పెట్టాడు.

వినేవాళ్ళుంటే చాలు, ఈ డాక్టరు చెప్పిందే విసుగు లేకుండా ఎన్ని సార్లయినా చెబుతాడు.

"సారధి అని ఒకతను నా దగ్గిరికి వచ్చాడు పుట్టుగుడ్డి అతను..." చెప్పసాగాడు. "చిన్నతనంనుంచీ ప్రపంచంలో అందాలన్నిటినీ ఊహించుకుంటూ ఉండేవాడనుకుంటా. నేను అతణ్ని పరీక్షచేసి చిన్న ఆపరేషన్ ద్వారా కళ్ళు వస్తాయని చెప్పినప్పుడు అతని ఆనందం వర్ణనాతీతం. అన్నీ చూడగలనుగదా- అన్నీ చూడగలను కదా అని రెట్టించి అడిగాడు. ప్రపంచాన్ని గెలవ బోతున్నంత సంతోషం అతడిలో కనిపించింది" కార్డ్సు పంచడం కోసం డాక్టరు ఆగాడు.

బయట వర్షం కొద్దిగా ఎక్కువైంది.

"ఆపరేషన్ జరిగి అతడికి కళ్ళు వచ్చేయా."

డాక్టరు అన్నాడు "కానీ ఆ తరువాత అతను పదిరోజులకి చెకింగ్‌కి వచ్చినప్పుడు ఒక దారుణమైన విషయం కనిపెట్టేను. ఒక 'నర్వ్' దెబ్బతిన్న కారణంగా అతడి చూపు మళ్ళీ పోబోతోంది ఈ సారి అతనికి ఏ ఆపరేషనూ కళ్ళు తేలేదు. ఈ వార్త వినగానే అతడు నిశ్చేష్టుడై చాలా సేపు మాట్లాడలేదు. మొహం రక్తం లేనట్లుగా పాలిపోయింది. చాలా హీనమైన కంఠంతో 'మళ్ళీ ఎన్నాళ్ళకి నేను నా పూర్వపు దౌర్భాగ్యపు స్థితికి వెళ్ళిపోతాను డాక్టర్' అని అడిగేడు.

తనలో తనే ఆలోచించుకుంటున్నట్టు అతడు చేతిగోళ్ళ కేసి చూసు కుంటూ కుర్చీలో అలాగే కూర్చుని, ఆ తరువాత మౌనంగాలేచి వెళ్ళి యాడు మళ్ళీ నా దగ్గిరకు రాలేదు" డాక్టరు చెప్పడం ఆపాడు.

"ఇందులో సైకాలజీ ఏముంది ?" అడిగాడు మూర్తి.

"అసలు పాయింటు ముందే ఉంది" అన్నానేను.

"సారధి సైట్ సీయింగ్ కోసం బయల్దేరేడని తెలిసింది తరవాత నాకు. కళ్ళున్న నాలుగు నెలల్లోనూ అందాలన్నీ చూసెయ్యాలను కోవ డంలో చిత్రమేమీలేదు. కానీ..." ఆగి, నెమ్మదిగా అన్నాడు. "రెండు నెలలు తిరిగేసరికల్లా సారధి తన కళ్ళని తనే పొడిచేసుకున్నాడు. అంటే స్వభావ సిద్ధంగా పోవటం కోసం నాలుగు నెలలూ ఆగలేదు."

"ఫెంటాస్టిక్" అన్నాడు మూర్తి. "కానీ ఎందుకు ?"

"అదే ప్రశ్న నేనూ వేశాను" అన్నాడు. అదేం సైకాలజీయో నా కర్థం కాలేదు.

"రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ఆనందం ఇకముందు ఉండదు అన్న అసంతృప్తి దాన్ని అనుభవించేటప్పటి సంతృప్తికన్నా ఎక్కువయి అలా ప్రవర్తించి ఉంటాడు" సమర్థిస్తున్నట్లు అన్నాడు డాక్టరు.

"నాన్సెన్స్ ! వాడు పిచ్చివాడై వుంటాడు. కళ్ళు ఉన్నంత కాలం శుభ్రంగా అనుభవించక అదేం పోయేకాలం ?" అన్నాడు మూర్తి.

"ఓకే— మీరిద్దరు, నేనొక్కణ్ణి. అది సైకాలజీ కాదు, పిచ్చి తనమే. సరేనా" అన్నాడు డాక్టరు. మెజారిటీ నిర్ణయాన్ని ఒప్పుకుంటు న్నట్టు.

* * *

"టైమెంతయింది ?" తలుపు తీస్తూనే అడిగింది మహాలక్ష్మి. అం దులో వ్యంగ్యం గ్రహించి ! మాట్లాడలేదు నేను

"మిమ్మల్నే అడుగుతోంది" అంటూ గొంతు కొద్దిగా పెద్దదిచేస్తూ రెట్టించింది. టై విప్పుతున్న వాడినల్లా ఆగి నెమ్మదిగా అన్నాను. "ఆలస్య మైంది. క్లబ్...అని" ఏదో చెప్పబోతూ ఉంటే, "క్లబ్బు...క్లబ్బు... క్లబ్బు... ఆ క్లబ్బునే పెళ్ళాడలేక పోయారా ?" అంది.

రాత్రి పదకొండయింది తెరచివున్న గ్లాస్ విండోస్‌లోంచి మాలతీ తీవె తాలూకు అపరిమళం అలలు అలలుగా వస్తూంది. డ్రెస్సింగ్ టేబుల్ బెల్జియం అద్దంలోంచి డబుల్‌కాట్ మీద వేసిన తెల్లటి దుప్పటి మల్లె పూవులా మెరుస్తూంది.

"ఈ మధ్య ఇదొకటి నేర్చుకున్నారు."

"ఏది ?" తాపీగా బూట్లు విప్పుకుంటూ అడిగాడు.

"ప్రతిదానికీ మీకు కాదన్నట్టు మౌనంగా ఉండిపోవటం..."

"నిజమే ముందు నేనూ మాట్లాడేవాణ్ని నా కలలు ఒక్కొ టొక్కటే కళ్ళముందు కరిగిపోతూ ఉంటే నిస్సహాయతని ఆపుకోలేక మాటకు మాట చెప్పేవాణ్ని."

కోపం భావుకత్వాన్ని చంపేస్తుంది.

ఈ నిజం గ్రహించలేక ఇంట్లో నా మాటలు వినిపించటం మానే శాయి. చప్పట్లుకొట్టే రెండో చెయ్యి లేకపోవటంతో ఇంట్లో శ్మశాన నిశ్శ బ్దం పేరుకుపోయింది. అప్పుడప్పుడూ పాప అల్లరీ, ఏడుపూ, బాబు మాటలూ తప్ప ఇంకేం వినిపించేవి కావు.

"భోజనాని కొస్తారా ?"

"ఆకలి లేదు."

"ఎందుకుంటుంది ? పేకాటలో ఎవడికో బాగా డబ్బొచ్చి ఉంటుంది. వాడు అందరికీ బాగా తాగించి ఉంటాడు."

నెమ్మదిగా కళ్ళెత్తి చూశాను. జీవితాంతం కలిసి ఉండి ఒకరిమీద

ఒకరు నమ్మకం పెంచుకోవాల్సిన నా అర్థాంగి ఎందుకు ప్రతిక్షణం నాలో తప్పుల్నే ఎంచటానికి ప్రయత్నిస్తూంది ?

నుదుటిమీద అరచెయ్యి పెట్టుకొని అలసటగా కళ్ళు మూసుకొన్నాడు.

గదిలో బెడ్‌లైట్ కాంతి మందంగా పరుచుకొని ఉంది. లోపల వాష్‌బేసిన్ దగ్గర ఏదో కడుగుతున్న చప్పుడు.

వచ్చి పక్కనచేరి "ఊఁ...జరగండి ఇక" అంది.

ఆ "ఊఁ" "ఇక" లాటి చిన్న చిన్న పదాలు నన్ను బాధపెడుతూ ఉంటాయి. పైకి వ్యక్తం చేసుకోవటానికి వీల్లేని బాధ...గుండెల్ని లోతుకంటా సున్నితంగా కోసే బాధ.

"ఏమన్నానని అంత కోపం ?" మోచేతిమీద పక్కకి తిరుగుతూ అంది

కళ్ళు మూసుకొనే అన్నాను– "కోపమా !"

"లేకపోతే మునీశ్వరుడిలా ఆ పడుకోవటం ఏమిటి ?"

భారంగా పక్కకి తిరిగాను...

గరుగ్గా తగిలే నేత చీర– నూనెతో ఎండిన జుట్టూ– కిటికీ అవతల వాడి రాలిపోయిన మల్లెలు మొక్కుబడికోసం ఉన్నట్లుగా మమ్మేలియడ్ గ్లాండ్స్, దూరంగా కుక్క ఏడుస్తూంది. తెల్లటి పక్కకీ, ఆవేశపు శరీరానికీ మధ్య శవం– అచేతనం, న్యూటన్ మూడో సూత్రం ఏమైంది ? బలమైన కడలి తరంగాల ఆవేశానికి కొండరాళ్ళు కూడా కదులుతాయే... ఫార్మల్, ఫార్మల్. దీన్నించి పైకి వెడితే అపరిహార్యమూ, అబాధితమూ, పరమార్థమూ, పూర్ణసత్యమూ, అయిన ప్రేమ ... కిందికొస్తే అనిశ్చితమూ, అవ్యక్తమూ, అసిద్ధమూ, అసంపూర్ణమూ అయినా వాస్తవం. పురుషుడి మనసుని శారీరకంగా గెలవటం అనే కళ ఎందరు ఈవ్‌లకు తెలుసు ? మల్లెపూల...

"ఏమండీ"

ఆలోచనలు చెదిరాయి... "ఊ"

"ఈ రోజు పనిక్రురాడు రాలేదు."

ఉప్పెనలాపడే నయాగరా జలపాతపు ధారలకి ఆనకట్టవేసి సహారా ఎడారిలో నింపాలనే అసందర్భపు ఆలోచన...

"వింటున్నారా ?"

"ఊ..."

"రేపటికి కూరగాయలు లేవు. వెంకణ్ని తెమ్మంటే సాయంత్రం వస్తానని మళ్ళీ రాలేదు."

"ఊఁ..."

వాణ్ణి పనిలోంచి తీసెయ్యాలి. ఈ మధ్య పొగ రెక్కువయింది. వాడికి పక్కింటివాళ్ళు మొన్న...

చెంపమీద ఫట్‌మని కొట్టాలన్న ఆవేశాన్ని అతికష్టంమీద యింకో నిముషంపాటు ఆపుకొని, తరువాత నా పక్క మీదకు వచ్చి పడుకున్నాను.

* * *

డైనింగ్ సీట్లో కూర్చొని తలుపు వేస్తూంటే అడిగింది, "ఈరోజు తొందరగా వస్తారా ?"

"సాయంత్రం కళాభారతిలో చిట్టిబాబు వీణా ప్రోగ్రామ్ వుంది. వస్తావా ?" కళ్ళలో మినుక్కునే ఆశ.

"నే నెక్కడికి వస్తాను ? ఆ వీణా సన్నాయీలు తలనొప్పి బాబో"

లాభంలేదు. మా జీవితాలు రైలుపట్టాలు. అవి కనీసం చూడటాని కయినా దూరంగా కలుసుకొంటూ వుంటాయి.

"సరే, అయితే" కారు స్టార్టుచేస్తూ అన్నాను.

"తొమ్మిదింటికల్లా వచ్చేస్తాను" నెమ్మదిగా కదలింది కారు.

"తొందరగా వచ్చేద్దామనయినా ఉండదు-ఖర్మ" గొణిగింది.

కారు ఆపి అడిగాను. "ఎందుకు ?"

"ఎదుకేమిటండీ, అందరూ చూడండి భార్యలతో ఎలా కబుర్లు చెబుతారో !"

స్టీరింగ్ వీల్‌మీద నీటిచుక్క జాలిగా చూస్తూంది. నెమ్మదిగా తలెత్తాను. "సరే, అయితే సాయంత్రం తొందరగా వస్తాను అయిదన్నరకే ! ఇంకా ఏడుగంటల టైముంది. మనిద్దరం కామన్‌గా మాట్లాడుకొనే ఏ ఒక్క టాపిక్ అయినా దొరుకుతుందేమో ఈ ఏడుగంటల్లో ఆలోచించి వుంచు."

కారు కదిలింది. మెదడులో చేపల కదలికమల్లే ఆలోచనలు. ఈ కథలో నా తప్పు ఎంతవరకు ఉందని ? ఇది ఇలానే కొనసాగితే నేనేమవుతాను ? అలక్‌సంద నదీతీరంలో భౌతిక సుఖాలన్నీ వదులుకొని నివసించే మునుల్లో చేరిపోతానా ? అర్ధరాత్రివరకూ తాగి యింటికి చేరుకొనే ఎస్కేపిస్ట్ నవుతానా ? స్త్రీని శారీరకంగా కొనుక్కునే వ్యభిచారినవుతానా ? నా ఆలోచనల్లో లేతదనం పోతూంది. మనసు నల్ల బారుతూంది ఒకప్పుడు ప్రపంచం అంతా ఆనందంగా వుండేది. మనుష్యలందరూ మంచివాళ్ళే. నా పెదవులమీద ఎప్పుడూ చిరునవ్వే. కానీ యిప్పుడు...ఇప్పుడు ...నే నేమవుతున్నాను— ఎటు వెడుతున్నాను ! వేదాంతం అనే హిమాలయంపైకా ! పతనం అనే అథఃపాతాళానికా ? ఎటో ఒకవైపు జారిపోవటం మాత్రం ఖాయం.

నా జీవితంలో స్వప్న ప్రవేశించకపోయి వుంటే అదే జరిగేది.

* * *

గ్రీన్‌రూమ్‌లో అభినందించటానికి వచ్చిన వాళ్ళంతా ఒక్కొ

క్కరే వెళ్ళిపోసాగారు. క్షణంలో గది ఖాళీ అయింది. ఒక్క క్షణం ఒక మూల మౌనంగా నిలబడి వున్నాను. బయట మనుషుల అలికిడి లీలగా వినిపిస్తూంది.

మేకప్ తుడుచుకోవటం పూర్తయి, బయటకు రాబోతూ, నన్ను చూసి విస్మయంతో ఆగి— "మీరు—" అర్ధోక్తిలో ఆపివేసింది.

మాట్లాడలేదు నేను.

మాట్లాడా అనిపించలేదు.

ఆ కల ఎక్కడ కరిగిపోతుందో అన్న భయంతో అలాగే తదేకంగా చూస్తూండిపోయాను. అలా చూడటం తప్పనీ, నాకూ పెళ్ళయిందనీ, ఒక బాధ్యతాయుతమైన అంతస్తులో ఉన్నాననీ నాకప్పుడు గుర్తుకురాలేదు. సన్నటి తీవెలావున్న శరీరాన్నే చూస్తున్నానో- పిడికిలిలో ఇమిడిపోయే నడుమునే గమనిస్తున్నానో, కలువరేకుల్లాంటి కళ్ళలోకే చూస్తున్నానో- ఏమీ తెలియటం లేదు. నా చూపులు కలిపేచోట శూన్యం తప్ప ఇంకేమీ కనపడటంలేదు. ఒక అలౌకికమైన స్థితి అది.

"ఏమిటి- మాట్లాడరా ?" అంటూంది ఆమె.

ఆ అనుభూతినుంచి బయటకెలా రాను ?

లేతమామిడి చివురుల్ని ఆరగించి, కమ్మగాకూసే కోయిల కూతని వసంతంలో విన్నప్పటి అనుభూతి- యుగయుగాలుగా ఎదురు చూసింది, ముందు ప్రత్యక్షమయిన ఆనందం— కలో, నిజమో తెలుసుకోలేని దిగ్భ్రమ...అతికష్టంమీద నన్ను నేను స్వాహాలోకి తెచ్చుకోగలిగాను.

"ఏం మాట్లాడాలో తెలియటంలేదు" అన్నాను.

"నిజానికి మీ నాట్యంచూసి అభినందించాలని వచ్చాను. కానీ మీ అందం చూసేక మాటరానని మారాం చేస్తోంది."

ఆమె మొహంమీద విసుగులాంటి భావమేదో లీలా మాత్రంగా

కనబడింది. అందులో ఆశ్చర్యం ఏమీలేదు. ఆమె అందాన్ని స్వంతం చేసుకోవటం కోసం చాలామంది మగవాళ్ళు రకరకాల పొగడ్తలతో ఆమెను చేరుకోవటానికి ప్రయత్నించి ఉండవచ్చు. కానీ నేను—

ఎంతోకాలంగా ఎదురుచూచిన పెన్నిధి దొరకబోయి, చేతుల్లోంచి జారిపోతున్న వేదన ఒక్కసారిగా మనసుని దిగులుతో ముంచెత్తి వేసింది. ఏదోలా మాటలు పెంచుకొని, పరిచయాన్ని నిలుపుకోవటం నాకు చేత కాదు చాలా మితభాషిని నేను.

తలవంచుకొని నెమ్మదిగా వెనుదిరిగాను.

మ్లానమైన నా మొహంలో కనబడిన విషాదరేఖ ఏదో ఆమెని కదిలించి ఉండాలి. "చూడండి" అంది. ఆగి వెనక్కి తిరిగాను.

"మీ పేరు ?"

"అనిల్‌దేవ్"

ఆమె కళ్ళల్లో ఏదో లీలగా ఆశ్చర్యం కనబడింది. "మీరూ—" అంది ఏదో జ్ఞాపకం తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తున్నట్టు "పొట్రేట్ పెయింటర్ దేవ్ కదూ ?"

అంతకు పదిరోజుల క్రితమే నా ఫోటో సన్‌డేలో పడింది. తలూపాను. ఆమె కళ్ళల్లో ఆశ్చర్యం, సంతోషం చోటు చేసుకున్నాయి. "ఓహ్ ! ఎంత అదృష్టవంతురాల్ని !" అప్రయత్నగా తనలో తను అనుకొంటున్నట్టు పైకి అంది.

"ఎందుకు ?"

"వన్ అఫ్ ది టాప్ పెయింటర్స్ ఆఫ్ ది కంట్రీ కమింగ్ టు కంగ్రాచ్యులేట్ మీ" ఆమె క్షణంలో వెయ్యోవ వంతు నా కళ్ళల్లోకి చూసి తల దించుకుంది. ఆమె అందాన్నంతా ఫ్రేములో బంధించుకోవాలని అయిదు నిమిషాల క్రితం నేను చూసిన చూపులానే వుంది అది.

ఆర్తితో కూడిన చూపు !

* * *

"నాలో ఈ పెయింటింగ్ అనే ఆర్ట్ లేకపోతే మన పరిచయం యిలా పెరిగి ఉండేదికాదు"

నవ్వింది "ఏం ?"

"ఆ రోజు మొదటి మాటతోనే వెళ్ళిపోయేవాణ్ణి."

ఆమె క్షణం ఆలోచిస్తూ వుండిపోయింది. "అందమైన స్త్రీ అలాంటి చిన్న చిన్న అపాయాలనుంచి రక్షించుకోవటం వయసుతోపాటే నేర్చుకొంటుంది."

"నాతో స్నేహం అపాయకరమా ?" అల్లరిగా నవ్వబోయాను. స్వప్న నవ్వలేదు. "బి సబ్మిట్ టు యూ, దేవ్" అంది. ఆమె కంఠంలో ఏదో అస్పష్టమైన అస్థిరత్వం స్పందిస్తూంది. "ప్రేమ ఎందుకు ఉద్భవి స్తుందో నాకు తెలీదు. మీ వ్యక్తిత్వాన్ని చూశా ? అందాన్నా... మీలో వున్న కళనా- ఊహూ... నాకున్న అనుభవం సరిపోదు జవాబు చెప్పటా నికి. కానీ ఒకటి మాత్రం నిజం. ఐ...ఐ..." ఆమె కంఠం వణికింది ... "ఐ లవ్ యూ, దేవ్"

ఆమె చేతిమీద చెయ్యి వేశాను.

కళ్ళులేనివాడు దారితప్పిన యింకో కళ్ళు లేనివాడికి చెయ్యి అందించే టప్పటి జాలి అది. ప్రేమ జాలితో ప్రారంభమై, ఆకర్షణతో పెరిగి, అనురాగంతో బలపడి, కోర్కెతో పరిపూర్ణత్వాన్ని పొందుతుంది.

* * *

స్వప్నతో పరిచయమయ్యాక ఎక్కడలేని ఉత్సాహం ప్రవేశించింది నాలో. ఎప్పుడో మానివేసిన టెన్నిస్ ఆట మళ్ళీ ప్రారంభించాను. నిర్లి ప్తత పారిపోయింది. చిత్రమేమిటంటే. ఇప్పుడు మహలక్ష్మి కూడా

నాకు స్నేహితురాలిగా కనబడుతూంది. ఒక విధమైన ట్రాన్స్ అది. అంతా ఆనందమే.

ఎన్నెన్ని కబుర్లు !

కిట్స్ నైటింగేల్ నుంచీ అయినెస్కో అబ్సర్డ్ థియరీ వరకూ.

స్వప్నలో నాకు బాగా నచ్చిన విషయం— పెదవులపై ఎప్పుడూ చెదిరిపోని చిరునవ్వు. ప్రపంచాన్ని శాసించ గల నవ్వు అది.

గంటల తరబడి ఆమెని చూస్తూ కూర్చుండిపోయేవాణ్ణి, కాలం తెలిసేది కాదు ప్రేమ అంటే అదేనేమో నాకు తెలీదు కాని, ఆమె ఎప్పుడూ నాకు కొత్తగానే వుండేది. ఆమెని మొట్ట మొదటిసారి స్పృశించటంకూడా నాకొక మరువరాని అనుభూతే. ఆరోజు నాకింకా జ్ఞాపకం— ప్రతీ సంఘటనా— ప్రతీ ఆలోచనా—

"ఈ లేక్ వ్యూ చాలా బాగుందికదూ !"

తలూపాను.

తెరిచి వున్న కిటికీల్లోంచి గాలి అలలుగా వీస్తూంది. గెస్ట్‌హౌస్ పక్కనే వున్న చెరువు విశాలంగా, నీలంగా కనబడుతూంది. కెరటాలు నెమ్మదిగా లేచి, తీరంవైపు వస్తున్నాయి. టేప్‌రికార్డర్‌లోంచి తాహిర్ హుస్సేన్ గజల్ నెమ్మదిగా వినిపిస్తూంది.

సృష్టి మౌనంగా ఏదో రసానుభూతిలో లీనమైనట్టు స్తబ్ధంగా వుంది. పిల్లగాలి స్పర్శకి ఆమె తెల్ల చీర అంచులు నెమ్మదిగా కదులుతున్నాయి.

ముందుకు వంగాను.

అస్పష్టమైన ఉద్వేగంవల్ల నుదురుమీద చెమట పడుతూంది. కళ్ళు నేలకువాల్చి చూస్తూంది ఆమె భయంతో క్రింద పెదవి వణకటం స్పష్టంగా తెలుస్తూంది. మొట్టమొదటిసారి పురుష స్పర్శకి అయత్తమవుతున్న శరీరం చిగురుటాకులా కంపిస్తూంది భుజాలచుట్టూ చెయ్యివేసి, నెమ్మదిగా దగ్గరకు

తీసుకొని... మెడవంపులో వెచ్చదనం, కురుల నీడలో చీకటి, చెక్కిళ్ళ నునుపుదనం...

"ఏమి టీ తడి—?" తన చెంపమీద వేలితో తాకుకొంటూ ఆశ్చ ర్యంగా చూసింది. "ఏమిటీ- మీరు...మీరేడుస్తున్నారా ?"

విషాదంగా నవ్వాను. "అయుండవచ్చు. భరించలేని సౌందర్యం నన్ను దిగులుతో ముంచెత్తి వేస్తోంది."

"చిన్నపిల్లాడిలా ఏమిటిది ?"

జుట్టులో చెయ్యి జొనిపి. దగ్గరకు తీసుకుని, హృదయానికి హత్తు కొంటే...

అమ్మా...అమ్మా ఎన్నాళ్ళమ్మా పళ్ళీ నీ ఒడి వెచ్చదనాన్ని, నీ చేతులమధ్య నిశ్చింతనీ పొందుతూన్న అనుభూతి - క్షణాలు... నిమి షాలు ...గంటలు.

"ఏమిటిది ?"

"ఏమిటి ?" కదలకుండా అడిగాను.

"ఇలా ఉండిపోవటం —"

"అస్థిరత్వం —"

"అంటే..."

"ఊహుఁ... నాకే తెలీదు. కాని కదిలితే కల చెదరిపోతుందేమో నన్న భయం."

"నా గురించి మీకేం తెలుసు ?"

అక్కర్లేదు- ఏంతెలుసుకోవాలి? భార్యని ప్రేమించలేని దౌర్భాగ్యా డికి శీలం పట్ల నమ్మకం ఏమిటి ? ప్రేమకి అందంతోనూ, సెక్స్‌తోనూ సంబంధం లేదంటే నేను నమ్మను. నేను నిన్ను ప్రేమిస్తున్నాను స్వప్నా. నీ అందాన్ని, నీ లాలిత్యాన్ని, అణువణువునా సుకుమారత్వాన్ని నింపు

కొన్న నీ స్త్రీత్వాన్ని... ఇంకేం చెప్పను ? చెప్పటానికి నా కున్న భాషా పరిజ్ఞానం సరిపోదు నా కేడుపొస్తూంది అంతా చెయ్యి జారిపోతుందేమో నన్న భయం ... స్వప్నా, స్వప్నా, ఇంతకాలం ఏమైపోయావు నీవు ? ఒక భావుకుడి మనసు తూట్లు తూట్లుపడి, పూర్తిగా పనికిరాకుండా పోయే దాకా ఎక్కడ ఉండిపోయావు నువ్వు ? పువ్వుల్లో దాక్కొని లాలిత్యాన్ని సంతరించుకొంటూ నన్ను మర్చిపోయావు ! నీ మంచు బిందువులతో ఆడు కొంటూ నన్ను గమనించకుండా ఉండిపోయావు— ఓహో — ఈ ప్రపంచం అంతా సర్వనాశనం అయిపోతే ఎంత బాగుణ్ణు ! పిచ్చిగా వుంది నాకు — నా గతాన్ని ఎలా మర్చిపోను నేను ? మహాలక్ష్మి, నువ్వు చచ్చి పోకూడదూ...బాబోయ్... ఏమిటి నా ఆలోచనలు– ఇంత భయకరంగా ఉన్నాయి ? ఆలోచనల్లో మహాలక్ష్మిని చంపగలిగానుగానీ, నా రక్తంలో జీర్ణించుకుపోయిన నీతిని ఎలా చంపగలను ? చిన్నప్పటినుంచీ నూరిపోసిన సంస్కారాన్ని ఎలా చంపగలను ? ఇదంతా తప్పు— అదంతా తప్పు అని ఎవరో లోపల ఎక్కడో గుండెలోతుల్లోంచి వినిపించే ధ్వని నెమ్మదిగా ఎక్కువై ...భరించలేనిదై ఈ మాత్రం ఆనందాన్ని కూడా అనుభవింప నివ్వక– నలువైపులనుంచీ చుట్టుముట్టి— తప్పు...తప్పు... తప్పు...

చటుక్కున లేచి, బయటకొచ్చి కారు డోర్ తీసి కూర్చుని అరవై మైళ్ళ స్పీడులో ఇంటికొచ్చాను...

అక్వేరియంలో నెమ్మదిగా కదిలే చేప పిల్లలు...

వాటి నిశ్చింతని చూస్తే ఈర్ష్యగా వుంది.

* * *

"ఈ మధ్య మీరు మారిపోతున్నారు" నావైపు పరిశీలనగా చూస్తూ అంది మహాలక్ష్మి.

"అంతకు ముందు కొద్దిగానన్నా మాట్లాడేవారు ఇప్పుడదీలేదు"

నిజమే అన్యాయం చేస్తున్నాను. ఏడడుగులు నడిచిన నమ్మకంతో తన ఊరిని, తన వాళ్ళందర్నీ వదిలేసి వచ్చిన ఒక స్త్రీకి... నేను చేస్తున్న దేమిటి ? మెదడులో రక్తనాళాలు పగిలిపోయేలా పరస్పర విరుద్ధభావాలు.

"సాయంత్రం తొందరగా వచ్చి పిల్లల్ని అలా బయటికి తీసుకు వెడదామనన్నా వుండదు..." గొణుగుతూంది.

బయటికొచ్చి కార్లో కూర్చున్నాను.

ఈసారి ఎక్కడికి వెళ్ళను ?

* * *

"ఈసారి ఏమైనాసరే, ఈ ఆనందాన్ని వదులుకో దలుచుకోలేదు" అడుగు ముందుకువేస్తూ అన్నాను.

అరవిచ్చిన మందారంలా నవ్వింది స్వప్న.

"లేదు- మనం అనుభవించలేం..."

"ఏం- ఎందుకని ?"

లేచివెళ్ళి కిటికీ ఊచల్ని పట్టుకొని, బయటికి చూస్తూ ఉండిపోయింది చాలాసేపు. కొంచెం సేపటికి ఆమె కంఠం నెమ్మదిగా తనలో తనే ఆలోచించుకొన్నట్టు వినిపించింది

"ఎలా? ఎలా అనుభవించగలం...నా వయసు ఇరవై రెండు. ఇంకో రెండేళ్ళు నిండిన తర్వాతయినా పెళ్ళి చేసుకోవాలన్న విషయం ఎలా మర్చిపోగలగటం ? ఊహల్లో వ్యక్తికి మనసు అర్పించినా, చేసుకొన్న మనిషికి తనువు అర్పిస్తే అదో సంతృప్తి సెంటిమెంట్సేమిటి అనుకొంటాంగానీ, అవి మనం పుట్టినప్పుడు మనల్ని చుట్టుముడతాయి. కాదంటారా ?"

ఊహూ... వదులుకోలేను ఇంత లోతుగా ఇంత సున్నితంగా ఆలోచించే ఈ స్త్రీని వదులుకోలేను.

ప్రపంచం తిరగబడ్డా సరే !

ఒక నిర్ణయానికి వచ్చినట్టు లేచేను. "నేను పెళ్ళి చేసుకుంటాను స్వప్నా!"

ఆమె విషాదంగా నవ్వింది. "అదీ మీ బాధని పోగొడుతుందని అనుకోను."

"ఏం ఎందుకని-?"

"చేసుకొంటే అనుభవించే ఆనందం కన్నా, చేసుకోనందు వల్ల ఎవరికో చేసిన అన్యాయమే ఎక్కువ బాధ పెడుతుంది. దాన్నించి తప్పించుకోవటం అంత సులభం కాదు."

నిజమే!

ఈ కట్టుబాట్లని భౌతికంగా ఛేదించుకొన్నా మానసికంగా ఆ తరువాత ఏర్పడే వ్యధని తప్పించుకోవటం కష్టం.

మరెలా ?

అదే ప్రశ్న అడిగేను.

ఆమె నెమ్మదిగా నావైపు తిరిగింది. "రెండే దార్లు. ఇంకో రెండు సంవత్సరాల తర్వాత ఏం జరుగుతుంది అన్న విషయం మరచిపోయి చేతి కందినన్ని సౌఖ్యాలూ అనుభవించటం. ఇక రెండో దారి..." ఆమె చెబుతోంది దూరం నుంచి విమాన శబ్దం హోరుమని చెవులలో... భరించలేని చేదు నిజపు హోరు గుండెలలో.

చెప్పటం పూర్తిచేసి అంది: "ఏ నిర్ణయమయినా బాధాకరమే. రెండు రోజులు ఆలోచించి, రెంటిలో ఏది మీకు నచ్చిందో చెప్పండి. మీ మనస్సుకు నచ్చేది ఏదయినా చెయ్యటానికి ఈ స్వప్న సిద్ధమే. మీకు ఆనందం కలుగుతుందంటే, శరీరం అర్పించటానికి కూడా..."

మనిషి మీద కసి తీర్చుకోవటానికి దేముడు ఈ ప్రేమ అనే అనిర్వచనీయమయిన బాధని సృష్టించాడు కాబోలు! ఆలోచనలతో నిద్ర దూరమయింది. మెదడులో కాల్చే ఆలోచనలు. రెండు రోజుల తర్వాత ఆమె సూచించినదాంట్లో రెండవ దారే మంచిదని అతికష్టంమీద చెప్పగలిగేను.

తప్పదు!

ఏదో ఒకటి యెన్నుకోవలసి వచ్చినప్పుడు అదే మంచిది.

* * *

ఇది జరిగిన కొన్నాళ్ళకి మూర్తి, డాక్టరూ, నేనూ, రామారావు టేబిల్ చుట్టూ కూర్చుని ఉన్నాం.

"రెండు నెలల్లో కళ్ళుపోతే పోవచ్చుగాక! దానికి ఇప్పుడే కళ్ళు పొడిచేసుకోవటం దేనికి? ఈ రెండు నెలలూ హాయిగా అనుభవించవచ్చు!" అన్నాడు రామారావు డాక్టర్ చెప్పిన కథవిని.

"అదో సైకాలజి- ప్రతి మనిషిలోనూ అది అంతర్లీనమై వుంటుంది" డాక్టర్ సమర్ధించుకో చూశాడు.

"నాన్సెన్స్, అది పిచ్చితనం."

"సరే మీరు ముగ్గురు... నేనొక్కణ్ణి. అది పిచ్చితనం. సరేనా" అన్నాడు డాక్టర్ వోడిపోయినట్టు

"కాదు డాక్టర్, నేను మీ వైపే. ఇద్దరటు ఇద్దరిటు" అన్నాను.

ముగ్గురూ నావైపు ఆశ్చర్యంగా చూశారు. ముఖంలో ఏ భావమూ ప్రతిబింబించకుండా పేకముక్కలు కలుపుతూ అన్నాను. "చేతిలో ఇప్పుడున్న ఆనందం, కొంత కాలం అయ్యేక పోతుందని తెలిసినప్పుడు ఇక అది ఆనందాన్ని ఇవ్వదు."

ఎవరూ మాట్లాడలేదు.

చేతిలో ముక్కలు కలువలేదు. డ్రాప్‌చేసి పేక పడేసి, లేచి కిటికీ దగ్గిరకొచ్చి నిలబడ్డాను. బయటంతా చీకటి నల్లగా...మనసులో వేదనలా.

స్వప్న జ్ఞాపకం వచ్చింది.

ఆ రోజునుంచీ మళ్ళీ కలవని స్వప్న...

ఇప్పుడెక్కడుందో?